సాక్షి
విజయనగరం

శుక్రవారం । 13 । జనవరి । 2023



సంక్రాంతి సంబరాలకు ఆ గ్రామాలు దూరం

సంక్రాంతి పండగలో తొలిరోజు నిర్వహించే భోగి మంటలకు ఆ గ్రామాలు కొన్ని దశాబ్దాలుగా దూరంగా ఉంటున్నాయి. -IIలో



స్టాంప్ వెండర్లపై విజిలెన్స్ తనిఖీ

రాష్ట్రవ్యాప్తంగా స్టాంప్ పేపర్ అమ్మకం దారులపై విజిలెన్స్ శాఖ నిర్వహించిన తనిఖీల్లో భాగంగా శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అమలు అధికారి ఎ.సురేష్‌బాబు ఆదేశాలతో గురువారం తనిఖీ చేశారు. -IIలో

నేడు మంత్రి బొత్స జిల్లాకు రాక

విజయనగరం అర్బన్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శుక్రావారం జిల్లాకు వస్తున్నారు. శనివారం ఉందయం 7 గంటలకు నగరానికి చేరుకొని స్థానికంగా నిర్వహించే పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి.

న్యూస్‌రీల్

ప్రయాణికులకు వీలుగా పల్లెవెలుగు సర్వీసులు

- కొత్త బస్సులను ప్రారంభించిన జోనల్ ఛైర్మన్ గదల బంగారమ్మ



పల్లెవెలుగు బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న జోనల్ ఛైర్మన్ గదల బంగారమ్మ

విజయనగరం టౌన్: ప్రయాణికులకు వీలుగా నడుపుతున్న పల్లెవెలుగు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ విజయనగరం జోనల్ ఛైర్మన్ గదల బంగారమ్మ కోరారు. విజయనగరం డిపో పరిధిలో గురువారం రెండు ఆల్ట్రా పల్లెవెలుగు బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం, సుఖవంతమని తెలిపారు. విజయనగరం నుంచి పార్వతీపురం రూట్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులు నడుస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రజారవాణాధికారి కె.శ్రీనివాసరావు, జోనల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ అప్పలరాజు, డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ బి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

19న వైద్యాధికారి పోస్టులకు ఇంటర్వ్యూ

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఖాళీగా ఉన్న 10 వైద్యాధికారి పోస్టులకు ఈ నెల 19వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహిస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణ కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో -3, ఎన్‌బీఎస్‌యూలో-3, ఆర్‌బీఎస్‌కేలో-1, టెలీహబ్‌లో-3 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హతగల అభ్యర్థులు ఒరిజనల్, జెరాక్సు ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. గుర్తింపు పొందిన విశ్వ విద్యాలయం నుంచి ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు ఏపీ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయిన అభ్యర్థులు అర్హులని చెప్పారు.

స్కూల్ అసిస్టెంట్లుగా ఎస్‌జీటీలు



డీఈఓ కార్యాలయంలో సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు

విజయనగరం ఫూల్‌బాగ్: హైస్కూళ్లు, ఇతర ప్రీ హైస్కూళ్లలో 3వ తరగతి నుంచి సబ్జెక్టు టీచర్లతో బోధన చేయించేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. నూతన విద్యా విధానంలో స్కూళ్లలో 3వ తరగతి నుంచి సబ్జెక్టుల బోధనకు సీనియర్ సెకండరీ టీచర్ల (ఎస్‌జీటీలు)కు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి ఇవ్వాలని భావించింది. దీనికోసం డీఈఓ కార్యాలయంలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించింది. మొత్తం 110 పోస్టులకు 100 మంది హాజరయ్యారు. కోర్టు కేసులు పరిష్కారమై, వీరికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతిలిచ్చే వరకు సబ్జెక్టు బోధన చేస్తారు. దీనికోసం నెలకు రూ.2500 చొప్పున సబ్జెక్టు టీచర్ అలవెన్సు ఇస్తారు.

కేటుగాళ్ల అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ సంజీవరావు

చీపురుపల్లి: ప్రజల ఖాతాల్లో నగదు కాజేస్తున్న సైబర్ నేరగాళ్లను అరెస్టుచేసినట్టు చీపురుపల్లి సీఐ జి.సంజీవరావు తెలిపారు. చీపురుపల్లి సర్కిల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. గుర్ల మండలం లవిడాం గ్రామానికి చెందిన రౌతు పూర్ణచంద్రరావు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి సుమారు రూ.7లక్షలు పోగొట్టుకున్నాడు. దీనిపై గత ఏడాది జూన్‌లో గుర్ల పోలీస్ స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తుచేసిన పోలీసులు పశ్చిమబెంగాల్‌లో ఉంటూ బీహార్ రాష్ట్రానికి చెందిన ఎ.దిప్పుకుమార్, మోహన్ కుమార్‌రావు నేరాలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. వీరిని చీపురుపల్లి రైల్వే స్టేషన్ వద్ద అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.4లక్షల నగదు, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, చెక్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంతో ప్రతిభ చూపిన గుర్ల ఎస్‌ఐ శిరీష, చీపురుపల్లి ఎస్‌ఐ సన్యాసినాయుడు, గరివిడి ఎస్‌ఐ, కానిస్టేబుళ్లను ఆయన అభినందించారు.

ఉగాదికి.. కొత్త ఊళ్లు



విజయనగరం మండలం నారాయణపురంజగనన్న కాలనీలో నిర్మాణంలో ఇళ్లు

ఇది రాష్ట్రంలోని అతి పెద్ద జగనన్న కాలనీల్లో ఒకటైన విజయనగరం శివారు గుంకలాం లేఅవుట్‌లోని నిర్మాణ పనులు పూర్తి అయిన ఇల్లు. ఇదొకటి కాదు ఇలా జిల్లాలో 34,505 ఇళ్లలో ఆయా లబ్ధిదారులతో తెలుగు సంవత్సరాది ఉగాది రోజున గృహప్రవేశం చేయించాలనేది ఇప్పుడు అధికారుల లక్ష్యం. తద్వారా ఏవో కొన్ని ఇళ్లున్న కాలనీ కాదు ఏకంగా కొత్త ఊళ్లు జిల్లా పటంలోకి రానున్నాయి.



- మార్చి 22న 34,505 గృహప్రవేశాలే లక్ష్యం
- జగనన్న కాలనీల్లో చురుగ్గా నిర్మాణాలు
- రూ.కోట్ల నిధులతో మౌలిక వసతుల కల్పన
- లబ్ధిదారులకు అడుగడుగునా ప్రభుత్వ సహకారం
- ఉగాది నాటికల్లా సొంతిల్లు కల సాకారం

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

సొంతిల్లు అనేది పేద, సామాన్య కుటుంబాలకు ఓ కల! ఇన్నాళ్లకు అది కార్యరూపం దాల్చుతోంది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఉగాది నాటికి పేదలకల నెరవేరుతోంది. పేదలందరికీ సొంత ఇల్లు ఇస్తానన్న హామీని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పక్కాగా అమలుచేస్తున్నారు. మార్చి 22న ఉమ్మడిజిల్లాలో 34,505 కుటుంబాలతో గృహ ప్రవేశాలు నిర్వహించాలని ప్రభుత్వం జిల్లా అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించింది. వాటిలో ఇప్పటికే 18,320 ఇళ్లు పూర్తి స్థాయిలో సిద్ధమయ్యాయి. మరో 16,185 ఇళ్ల నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. అడుగడుగునా ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ సహకారంతో తమ చిరకాల స్వప్నాన్ని నెరవేర్చుకునే దిశగా లబ్ధిదారులు అడుగులు వేస్తున్నారు.

నవరత్నాల్లో భాగంగా..

నవరత్నాలు అమలులో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించిన 'పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమం ఇల్లులేని పేదలపాలిట వరమైంది. ప్రభుత్వమే స్థలాన్ని కొనిచ్చి అందులో అన్ని వసతులనూ సమకూర్చుతోంది. ఇంటి నిర్మాణానికి ఆర్థికంగా కూడా సహకారాన్ని అందిస్తోంది. దీంతో లబ్ధిదారులంతా తమ ఇళ్ల నిర్మాణ పనుల్లో నిమగ్నమయ్యారు.

ఉగాది నాడు సామూహిక గృహప్రవేశం

జిల్లాలో మొత్తం 77,205 ఇళ్లు మంజూరయ్యాయి. 651 లేఅవుట్లలో 36,631 ఇళ్లు, వ్యక్తిగత ఇళ్లు 40,574 ఉన్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ముహూర్తం మార్చి 22న ఉగాది నాడు జిల్లాలో మొత్తం 34,505 ఇళ్లలో సామూహిక గృహప్రవేశాలు చేయించేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. వీటిలో ఇప్పటికే 18,320 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మరో 16,185 ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఉగాదికి ఇంకో రెండు నెలలు గడువు ఉండడంతో ఇవన్నీ ఆలోగా పూర్తి చేయడానికి లబ్ధిదారులు నిర్మాణ పనులు చేసుకుంటున్నారు. ఈ పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షల చొప్పున లబ్ధిదారులకు ప్రోత్సాహకంగా అందిస్తోంది. డ్వాక్రా మహిళలకు అదనంగా రూ.35 వేలను రుణంగా మంజూరు చేయిస్తోంది.

మౌలిక వసతుల కల్పన

ఇళ్లు కాదు... ఊళ్లు నిర్మిస్తున్నామన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాటలకు అనుగుణంగా జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన నీరు, విద్యుత్‌తో పాటు అంతర్గత రహదారులను యుద్ధప్రాతిపదికన నిర్మిస్తోంది. శాశ్వత ప్రాతిపదికన మౌలిక వసతుల కల్పన జరుగుతోంది. ముందుగా ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి అనుగుణంగా బోర్లు తవ్వకం, తాత్కాలిక విద్యుత్ సరఫరా కోసం స్తంభాలు ఏర్పాటు, అడ్డంగా ఉన్న స్తంభాలను పక్కకు జరపడం, అంతర్గత గ్రావెల్ రోడ్లు, అప్రోచ్ రోడ్ల నిర్మాణం తదితర వాటికోసం గృహ నిర్మాణ శాఖ ద్వారా సుమారు రూ.162.22 కోట్లు ఖర్చు చేశారు. విద్యుత్ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, డ్వామా, మున్సిపాల్టీలు, పబ్లిక్ హెల్త్, పంచాయతీరాజ్ తదితర శాఖలు కోట్లాది రూపాయలను ఖర్చుచేసి మౌలిక వసతులను కల్పించాయి. లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం చివరిదశకు చేరుకోవడంతో శాశ్వత ప్రాతిపదికన విద్యుత్ లైన్లు, వీధి దీపాలు, ఇంటింటికీ తాగునీరు, రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. పలు కాలనీల్లో ఇప్పటికే విద్యుత్ సదుపాయం, జలజీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ తాగునీటి సరఫరా పనులు ప్రారంభమయ్యాయి.

జిల్లాలో జగనన్న గృహనిర్మాణ ప్రగతి

- జిల్లాలో మంజూరు చేసిన ఇళ్లు : 77,205
- 651 లేఅవుట్లలో మంజూరైన ఇళ్లు : 36,631
- సొంత స్థలాల్లో మంజూరు చేసిన ఇళ్లు : 40,574
- నిర్మాణం కోసం 1, 2 ఆప్షన్లు ఇచ్చిన లబ్ధిదారుల సంఖ్య : 67,075
- నిర్మాణం కోసం 3వ ఆప్షన్ ఇచ్చిన లబ్ధిదారుల సంఖ్య : 10,130
- ఇప్పటివరకు నిర్మాణం పూర్తి అయిన ఇళ్లు : 18,320
- నిర్మాణం పనులు పూర్తి చేయాల్సిన ఇళ్లు : 16,185
- ఉగాది నాడు సామూహిక గృహప్రవేశాల లక్ష్యం : 34,505

13 రకాల ఇంటి సామగ్రి సరఫరా

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అడుగడుగునా ప్రోత్సాహాన్ని అందిస్తోంది. ప్రతీ లబ్ధిదారుడికి సుమారు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల విలువైన స్థలాన్ని ఉచితంగా ఇచ్చింది. 651 లే అవుట్లలో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. ఇళ్లను ఎలాగైనా పూర్తి చేయాలన్న లక్ష్యంతో నిర్మాణానికి కావాల్సిన ఇసుకను లేఅవుట్ వద్దకే ఉచితంగా సరఫరా చేయిస్తోంది. సిమెంటు, ఇనుము కూడా అక్కడే తక్కువ ధరకు అధికారులు అందజేస్తున్నారు. ఇవికాకుండా అవసరమైన వారికి సిమెంట్ ద్వారబంధాలు, తలుపులు, కిటికీలు, కిటికీ రెక్కలు, ఎలక్ట్రికల్ సామాన్లు, స్టీల్ యాంగ్యులర్స్, పెయింట్స్, పైకప్పు రేకులు, టాయిలెట్ తలుపులు, వాటర్ స్టోరేజ్ ట్యాంకు, శానిటరీ ఐటమ్స్, సున్నం, వ్రిల్‌ఆర్ట్స్ తదితర 13 రకాల సామగ్రిని తక్కువ ధరకు అందుబాటులో ఉంచడం విశేషం. ఇప్పటివరకు సుమారు 80,010 మెట్రిక్ టన్నుల ఇసుకను, 13,14,541 సిమెంటు బస్తాలను, 12,81,101 కిలోల ఇనుము లబ్ధిదారులకు అందజేశారు. ఇతర 13 రకాల సామగ్రిలో 9,848 వస్తువులను అందజేశారు.

ఒక్కో ఇంటికి సర్కారు సామగ్రి...

సిమెంటు	:	90 బస్తాలు
ఇసుక	:	20 టన్నులు
ఇనుము	:	347 కిలోలు

ఇతర సామగ్రి :
సిమెంటు ద్వారబంధాలు, తలుపులు, కిటికీలు, కిటికీ రెక్కలు, ఎలక్ట్రికల్ సామాన్లు, స్టీల్ యాంగ్యులర్లు, పెయింట్స్, పైకప్పు రేకులు, టాయిలెట్ తలుపులు, వాటర్ స్టోరేజ్ ట్యాంకు, శానిటరీ ఐటమ్స్, సున్నం, వ్రిల్ ఆర్ట్స్



తెర్లాం మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో చురుగ్గా ఇళ్ల నిర్మాణ పనులు

గృహనిర్మాణ శాఖ ద్వారా మౌలిక వసతుల కల్పనకు ఖర్చు...

- నీటి సరఫరా : 1075 బోర్లు కోసం రూ.46.09 కోట్లు
- అప్రోచ్ రోడ్లు : రూ.6.59 కోట్లు
- అంతర్గత రహదారులు : రూ.45 లక్షలు
- భూమిని చదును చేయడానికి : రూ.2.34 కోట్లు
- తాత్కాలిక పెద్ల నిర్మాణం : రూ.6 లక్షలు
- సిమెంట్ గోదాములు : రూ.25 లక్షలు
- కల్వర్టులు, వంతెనలు : రూ.46 లక్షలు
- రహదారులు : రూ. 2.01 కోట్లు
- సోలార్ విద్యుత్ దీపాలు : రూ.2.64 కోట్లు
- విద్యుత్ సరఫరా : రూ.101.33 కోట్లు

జేజేఎం పథకం కింద తాగునీటి సరఫరాకు ప్రతిపాదనలు...

మొత్తం పనులు	734
అంచనా వ్యయం	రూ.138.81 కోట్లు
జరుగుతున్న పనులు	171
టెండరు దశలో ఉన్నవి	264
ఎఫ్‌టీసీలు ఇచ్చినవి	337

జగనన్న కాలనీల్లో విద్యుత్ సరఫరాకు ప్రతిపాదనలు...

సబ్‌డివిజన్	అంచనా
విజయనగరం, చీపురుపల్లి, భోగాపురం	రూ.80.71 కోట్లు
బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం	రూ.80.94 కోట్లు
ఎస్.కోట, గజపతినగరం	రూ.70.17 కోట్లు
గుంకలాం మెగా లేఅవుట్	రూ.18.16 కోట్లు



శృంగవరపుకోట మండలం పుణ్యగిరి జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

వివేకానందుని జీవితం యువతకు మార్గదర్శం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సూర్యకుమారి

- జాతీయ యువజన దినోత్సవంలో కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం: స్వామి వివేకానంద జీవితం యువతకు మార్గదర్శకమని కలెక్టర్ ఎ.సూర్యకుమారి అన్నారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని నెహ్రూ యువ కేంద్రం, సెట్విజ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్ కళాశాల వసతిగృహం మైదానంలో గురువారం నిర్వహించిన వివేకానందుని జయంతి వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివేకానంద చిత్రపటానికి పూలమాలలువేసి అంజలి ఘటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యువత దేశానికి వెన్నెముకగా నిలవాలని, చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా మంచి అలవాట్లతో దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని కోరారు. ఉన్నత స్థాయిలో స్థిరపడి తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో సెట్విజ్ సీఈఓ ఎస్‌వీకె దుర్గాప్రసాద్, నెహ్రూ యువ కేంద్రం కో ఆర్డినేటర్ విక్రమాదిత్య, 13(ఎ) బెటాలియన్ కల్నల్ ఎంకె ఆంటోని, సెట్విజ్‌మేనేజర్ కేవీఎస్ఎన్ మూర్తి, ఎన్ఎస్ఎస్ అధికారులు/కేడిట్స్ పాల్గొన్నారు.

మురిపించిన ముగ్గులు

విజయనగరం టౌన్:

సంక్రాంతి సంబరాల్లో భాగంగా శిల్పారామంలో జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముచ్చటైన ముగ్గులతో మురిపించారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను ఆర్డీఓ సూర్యకళ, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు, జిల్లా పర్యాటక అధికారి లక్ష్మీనారాయణ, ఐఅండ్‌పీఆర్ ఏడీ రమేష్ తదితరులు పర్యవేక్షించారు. విజేతలకు శుక్రవారం నిర్వహించే సంక్రాంతి సంబరాల్లో బహుమతులు ప్రదానం చేయనున్నారు.



ఆనందగజపతి ఆడిటోరియం ఆవరణలో ముగ్గులు వేస్తున్న మహిళలు



శిల్పారామంలో రంగవల్లుల పోటీల్లో పాల్గొన్న అతివలు

- స్థానిక ఆనందగజపతి ఆడిటోరియం ఆవరణలో వాజీ చానల్ ముగ్గుల పోటీలు నిర్వహించింది. పలువురు మహిళలు తమ సృజనకు పదును పెట్టారు. ముగ్గులతో చూపరులను ముగ్ధులను చేశారు. ముగ్గుల పోటీలతో సంక్రాంతి పండగ ముందుగానే వచ్చేసిందని టీవీ, సినీనటి జ్యోతిరాయ్ (గుప్పెడంత మనసు ఫేమ్ జగతి) పేర్కొన్నారు. 27 ఏళ్లుగా సంప్రదాయ బద్ధంగా రంగోలీ పోటీలు నిర్వహిస్తున్నట్టు వాజీచానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు తెలిపారు.

పెద్ద పండగ.. పిలుస్తోంది నిండుగ

- పండగ సెలవులతో స్వగ్రామాలకు ప్రయాణం
- వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు జోరుగా రాకపోకలు
- సంక్రాంతి పర్వదినానికి ముస్తాబవుతున్న పల్లెలు
- అతిథులకు స్వాగతిమిస్తున్న గ్రామీణ ప్రాంతాలు



విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సుల కోసం వేచిఉన్న ప్రయాణికులు



సొంత గూటికి చేరకుంటున్న యువత

విజయనగరం: సంక్రాంతి... తెలుగు ప్రజల పెద్దపండగ. ఇంటిల్లపాదికి ఇష్టమైన పండగ. రంగవల్లులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దుల ఆటలు, పిండి వంటకాలు, అయ్యగారికి వందనం.. అమ్మగారికి చందనమంటూ దూడూ బసవన్న దీవెనలు.. వేకువజామున జంగమదేవరలు మోగించే గంటలు.. బుడబుక్కలి వారి ఢమరుక నాదాలు.. బడాయి పోతూ నాకేం తక్కువంటూనే మామూళ్లడిగే పిట్టలదొరలు.. చమత్కారాలతో చిందులేస్తూ ఎంతోకొంత సమర్పించుకుంటే కానీ కదలని కొమ్మదాసరులు.. ఇలా చెప్పుకొంటే పోతే పెద్ద జాబితాయే పెద్ద పండగది. సంక్రాంతి సంబరానికి పల్లెలు ముస్తాబవుతున్నాయి. దూరప్రాంతాల వారి రాకతో కొత్తశోభను సంతరించుకుంటున్నాయి. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో పల్లెలకు చేరుకునేవారి సంఖ్య ఒకసారిగా పెరిగింది. రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్లు రద్దీగా మారాయి.

ప్రతి ఇంటా ప్రత్యేక వంట

సంక్రాంతికి ప్రత్యేక వంటలు పల్లెల్లో ప్రసిద్ధి. అరిసెలు, పాకుండలు, సున్నుండలు, జంతికలు, కారంబూందీ, కారంపూస, బొబ్బట్లు వంటి వంటకాలు సంక్రాంతిలో ప్రత్యేకం. స్వచ్ఛమైన నేతితో, అచ్చమైన బెల్లంతో చేసే సున్నుండలు మరీ ప్రధానమైనవి. భోగిరోజున భోగిమంటలో కాల్చిన వంకాయలతో చేసిన పచ్చడి, మకర సంక్రాంతి నాడు పులిహోర, గారెలు, పాయసం, కనుమకు గ్రామదేవతలకు సమర్పించే నైవేద్యాల్లో మాంసాహార వంటకాలు ప్రధానమైనవి. ఇవిగాకుండా ఇష్టాలనుబట్టి తయారుచేసుకునే దద్దోజనం, పొంగలి వంటివి అతిథులకు ప్రత్యేక వంటకాలు.

కొత్త అల్లుళ్లకు మర్యాదలే వేరు..

కొత్త అల్లుళ్లకు సంక్రాంతి కానుకగా ద్విచక్రవాహనాలు ఇవ్వడం జిల్లాలో ఆనవాయితీ. ఆ ఏర్పాట్లలో మామయ్యలు మునిగి తేలుతున్నారు. ఇదిగాకుండా ఇంటికొచ్చిన బంధుమిత్రులకు నూతన దుస్తులు పెట్టడం సంస్కృతిగా వస్తోంది. వస్త్ర దుకాణాల్లో ఇటువంటి సందడే కనిపిస్తోంది. పల్లెల్లో పిల్లలైతే వేకువజామున లేచి ఆవుపేడకోసం పోటీ పడుతుంటారు. పేడను ఇంటికి శ్రద్ధగా తెచ్చి గోడకు భోగి పిడకలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ విధంగా పిడకలను వెన్నముద్ద, తమలపాకు, అరటిపండులాంటి ఆకారాలతో వేయడం సంప్రదాయం. ఎండిన పిడకలను దండగా గుచ్చి భోగిమంటకు సిద్ధంచేస్తున్నారు.

పందెం రాయళ్లకు పండగే.. పండగ

సంక్రాంతి పండగ నేపథ్యంలో పందెం రాయళ్ల హడావిడి అంతా ఇంతా కాదు. మూడు రోజుల పాటు గ్రామాల్లో ప్రత్యేకశిబిరాలు ఏర్పాటు చేసుకుని మరీ జూదమాడేందుకు ఏర్పాట్లు చేసుకుంటారు. జూదంతో పాటు కోడి పందాలు జిల్లాలో జోరుగా సాగుతాయి. దీనికోసం ప్రత్యేకంగా సిద్ధంచేసిన వివిధ జాతు కోళ్లు బరిలోకి దిగేందుకు కాళ్లు రువ్వుతున్నాయి.



లగేజీలతో యువకుడు

ఎన్నోముచ్చట్లు..

- చిన్ననాటి బాల్య స్నేహితులంతా స్వగ్రామాలకు వస్తుంటారు. అంతా ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకునే సదావకాశం సంక్రాంతి ఇస్తుంది.
- కుటుంబంలో తరతరాలుగా ఉన్నవారంతా ఒకచోట చేరి కుటుంబాల పండగ నిర్వహించుకున్న సందర్భాలు సంక్రాంతిలో ఉంటున్నాయి.
- పూర్వ విద్యార్థులందరూ కలిసేందుకు సంక్రాంతి ఒక వేదిక.
- పిల్లలకు ఇష్టమైన బొమ్మల కొలువు సంక్రాంతి ప్రత్యేకత. సంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు బొమ్మల కొలువు వద్ద చేసే సందడి అంతా ఇంతాకాదు.
- సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీల వంటివి పల్లెల్లో ప్రత్యేకంగా నిలుస్తాయి.
- కొన్నిచోట్ల చూస్తే కళాకారులకు సత్కారాలు నిర్వహించి సంప్రదాయాన్ని కాపాడుతున్నందుకు కతజ్ఞతలు తెలియజేస్తారు.
- స్నేహితులతో కలిసి స్వీయచిత్రం దిగాలంటే చరవాణి తెర పట్టనంతగా ఉంటుంది సంక్రాంతి సందర్భం.
- సంక్రాంతి సందర్భంగా సంప్రదాయ వేషధారణలు చిన్నారులకు పరిచయం చేయాలి. రోజు ఆధునిక దుస్తుల్లో విసిగిపోయినవారికి ఊరటగా ఉంటుంది.

క్లుప్తంగా

ఇద్దరు కోడి పందాల రాయుళ్ల అరెస్ట్



అరెస్ట్ చేసిన పందాల రాయుళ్లు

మెంటాడ: మండలంలోని పెదచామాలాపల్లి గ్రామంలో గురువారం కోడి పందాలు ఆడుతున్న వారిపై దాడి చేసి పందెంరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఆంధ్ర ఎస్సై సిద్ధార్థ కుమార్ తెలిపారు.పందెం జరిగిన ప్రాంతంలో 5కోళ్లతో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నలుగురు పేకాటరాయుళ్లు..

రాజాం సిటీ: మండల పరిధిలోని బొద్దాం గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను గురువారం అరెస్టు చేశామని ఎస్సై రవికిరణ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి పట్టుకుని వారి నుంచి రూ. 3250 లు స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు చెప్పారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు



గాయపడిన హరిబాబు

వంగర: మండల పరిధి అరసాడ జంక్షన్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని రేగిడి మండలం పెద కోడిశ గ్రామానికి చెందిన పి.హరిబాబు గురువారం తీవ్ర గాయాలపాలయ్యాడు. రాజాం వైపు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న హరిబాబును వెనుక నుంచి వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన హరిబాబుకు 108 సిబ్బంది జగదీష్ ప్రథమ చికిత్స నిర్వహించి రాజాం ఆస్పత్రికి తరలించారు.

ట్రాన్స్‌ఫార్మర్ వైరు అపహరణ



అపహరణకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ వైరు

కొత్తవలస రూరల్: మండలంలోని దేశపాత్రుని పాలెం గ్రామంలో 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన అల్యూమినియం వైరు అపహరణకు గురైనట్లు విద్యుత్ శాఖ ఏఈ అప్పారావు తెలిపారు. దాని విలువ సుమారు రూ.లక్షా ఎభై వేలు ఉంటుందని, ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

వృద్ధుడి అదృశ్యం



వృద్ధుడు చిన్ని అప్పలస్వామి

విజయనగరం క్రైమ్: విశాఖ జిల్లా పెందుర్తి శ్రీనివాసనగర్‌కు చెందిన తన మామయ్య చిన్ని అప్పలస్వామి కనిపించడం లేదని కోడలు సునీత పెందుర్తి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి శ్రీనివాసనగర్‌కు చెందిన 72 ఏళ్ల వయసున్న చిన్ని అప్పలస్వామి డిసెంబరు 29న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో వారికి తెలిసిన అన్ని చోట్లా వెతికారు. అయినప్పటికీ ఫలితం కనిపించకపోవడంతో కోడలు సునీత పోలీసులను ఆశ్రయించింది. అదృశ్యమైన వృద్ధుడు విజయనగరం జిల్లా కేంద్రం పరిసరాల్లో ఉన్నట్లు సమాచారం ఉందని ఆచూకీ తెలిసిన వారు 9100604665, 6300289742 నంబర్లను సంప్రదించాలని పెందుర్తి పోలీసులు కోరారు.

వివాహిత ఆత్మహత్య



మృతురాలు భవాని (ఫైల్)

సాలూరు: పట్టణంలో దుగ్గాన వీధికి చెందిన వానపల్లి భవాని(35) ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు పట్టణ ఎస్సై నారాయణరావు మాట్లాడుతూ మృతురాలి తమ్ముడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

WANTED

JOB OPENINGS FOR ICT PROGRAM

Smart School ICT Central Government Funded Program for 2023. We are looking immediate Placement / Job for following Vacancies across **Andhra Pradesh**.

Distrct Supervisor with	15,000 + T.A + D.A (Salary)
Mandal Supervisor with	12,000 + T.A + D.A (Salary)
Computer Instructor with	12,000 to 14,000 (Salary)

Candidate process as per Central Governement instruction.
1. Interview 2. Online Examination 3.Documentation Final List Note: 15% Increment in Salary per year.

8500188866, 8500288866

సంక్రాంతి సంబరాలకు ఆ గ్రామాలు దూరం

- దశాబ్దాల కాలంగా పండగ చేసుకోని గిరిజన గ్రామాలు
- వారికి తెలిసిందల్లా ఇటుక, పిల్లి పండగలే
- సంక్రాంతి నేపథ్యంలో సంబరాలకు దూరమైన గ్రామాలపై ప్రత్యేక కథనం



బొబ్బిలి రూరల్: అక్కేనవలస గ్రామంలో కనిపించని పండగ వాతావరణం



బొబ్బిలి రూరల్: కొన్ని దశాబ్దాలుగా భోగి పండగ చేసుకోని కొల్లివలస గ్రామం

బొబ్బిలి రూరల్: తెలుగు వారి సంప్రదాయ పండగ అయిన సంక్రాంతికి ఆ గ్రామాలు కొన్ని దశాబ్దాలుగా దూరంగా ఉంటున్నాయి. సంబరాలు చేసుకోకపోవడానికి చెప్పుకోదగ్గ కారణం లేకపోయినా పండగ మాత్రం తమకు తెలీదంటున్నారు. చేతినిండా పని ఉంటే అదే తమకు పెద్ద పండగ అంటున్నారు మండలంలోని ఎరకందొరవలస, మోసూరు వలస, బట్టివలస, అక్కేనవలస, చిలకమ్మవలస, విజయపురి, సిమిడిగుడ్డివలస, మూలవలస, కృపావలస, దీవెనవలస వంటి దాదాపు 18 గిరిజన గ్రామాల ప్రజలు. ఇక్కడి వారెవరూ ఏటా వచ్చే భోగి, సంక్రాంతి పండగలు చేయరు. మండల కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న వీరికి తెలిసిందల్లా కేవలం ఇటుక, పిల్లి పండగలేనట. ఇటుక పండగ తర్వాత పెళ్లీడుకు వచ్చిన వారికి పెళ్లి చేస్తారు. ఆ తర్వాత యథావిధిగా రోజువారీ జీవనం సాగిస్తారు.

భోగి రోజు చనిపోవడంతో..

ఇదే మండలంలోని పిరిడి పంచాయతీలో ఉన్న కొల్లివలస గ్రామస్తులు కూడా భోగి పండగ చేసుకోరు. గ్రామంలో ఉండే వారంతా శ్రీశయన(సెగిడి) కులస్తులే కాగా, వీరి పూర్వీకులలో ఒకరు భోగి పండగ రోజున చనిపోవడంతో అప్పటి నుంచి వారంతా పండగకు దూరంగా ఉంటున్నారు.

బాడంగి: మండలంలోని ముగడ, భీమవరం, ఆకులకట్ట గ్రామాలు కూడా ఏటా భోగి పండగకు దూరం. తమ తాతముత్తాతల కాలం నుంచి ఈ పండగ చేసుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. వంగర మండలంలోని సీతారాం పురం గ్రామస్తులు భోగి పండగకు దూరంగా ఉంటారు. తరతరాల నుంచి పెద్దల ఆచారం ప్రకారం గ్రామంలో భోగి పండగ నిర్వహించుకోమని గ్రామస్తులు చెబుతున్నారు.



బాడంగి: పండగ సందడి లేని ముగడ గ్రామం



వంగర: భోగికి దూరమైన ఎం.సీతారాంపురం గ్రామం

మాకు భోగి పండగ తెలీదు...



భోగి పండగ మాకు తెలీదు. మేం ఇంతవరకు ఎప్పుడూ భోగి మంట వేయలేదు. సంక్రాంతి పండగ కూడా తెలీదు. మాకు తెలిసిందల్లా ఇటుక, పిల్లి పండగలే.

–సోడి లిండమ్మ, కొత్తవలస గ్రామం

పూర్వీకుల నుంచి ఆచారం లేదు..



మా పూర్వీకుల నుంచి భోగి పండగ చేసుకునే ఆచారం లేదు. పండగ చేసుకోకపోయినా భోగి పళ్లు పోయడం, పిండి వంటలు చేసుకోవడం, గొబ్బెమ్మలు చేయడం వంటివి చేస్తాం.

కోల బలరాం, విశ్రాంత ఉపాధ్యాయుడు, శ్రీశయన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు

విద్యా రంగానికి ప్రభుత్వం పెద్దపీట

- జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సెంచూరియన్‌లో డ్రోన్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: దేశంలో ఎక్కడా లేని విధంగా కనీవినీ రీతిలో విద్యా రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1990 దశకంలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించాలంటే పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. విద్యావ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పులతో నాటి పరిస్థితి మారిందని చెప్పారు. నాడు-నేడు పథకంతో విద్యా రంగాన్ని అభివృద్ధి చేసి మౌలిక సదుపాయల కల్పనకు చర్యలు చేపట్టారన్నారు. ప్రభుత్వ విద్య బలోపేతానికి ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని, విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే కార్పొరేట్ తరహా బోధన అందిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారని ప్రశంసించారు. ప్రభుత్వం సమకూరుస్తున్న వనరులను వినియోగించుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సాంకేతిక సామర్థ్యంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం మంచి పేరు, ప్రఖ్యాతులు సాధించిందని కితాబిచ్చారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని ప్రభుత్వపరంగా సహకారం అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ఈ-ఆటోలను ప్రారంభించారు. డ్రోన్‌ను పరిశీలించి తయారుచేసిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వీసీ జీఎస్ఎన్ రాజు, రిజిస్ట్రార్ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ వర్మ, డీన్లు సస్నీడియోల్, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

శాప్ లీగ్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికలు పూర్తి



శాప్ లీగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగన్న శాప్ లీగ్ షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు గురువారం పూర్తయ్యాయి. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ క్రీడామైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా..అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది క్రీడాకారులు అండర్-17 విభాగంలో..మరో 12 మంది క్రీడాకారులు అండర్-21 విభాగంలో ఎంపిక చేసినట్లు చీఫ్ కోచ్ అప్పలనాయుడు తెలిపారు. అండర్-17 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు బాపట్లలో, అండర్-21 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి లీగ్‌పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఎంపిక పోటీలను జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదరి ఇ.కృష్ణమూర్తి, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

రామ్‌రాజ్ నూతన వస్త్ర షోరూమ్ ప్రారంభం

- ప్రారంభించిన మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యే జోగారావు



రామ్‌రాజ్ బట్టల షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్/పార్వతీపురం: రామ్‌రాజ్ బట్టల నూతన షోరూమ్‌ను ఉమ్మడి విజయనగరం జిల్లా పార్లమెంట్ మాజీ సభ్యురాలు బొత్స ఝాన్సీలక్ష్మి పార్వతీపురంలో గురువారం ప్రారంభించారు. షోరూమ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమెకు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో కలిసి ఘనస్వాగతం పలికారు. అనంతరం పార్వతీపురం ప్రధాన రహదారి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ బట్టల షోరూమ్‌ను ఎమ్మెల్యే జోగారావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాజీ ఎంపీ ఝాన్సీ మాట్లాడుతూ ఒక మంచి సంప్రదాయానికి ప్రాముఖ్యం ఇచ్చే రామరాజు బట్టల షోరూం పార్వతీపురంలో ప్రారంభించుకోవడం చాలా సంతోషదాయకమని అదే విధంగా పార్వతీపురం ప్రాంతంలో ఇంకా అనేక నూతన వ్యాపారాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే ఆహ్వానం మేరకు ఆయన నివాసాన్ని సందర్శించిన మాజీ ఎంపీ ఝాన్సీకి ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా సాదర స్వాగతం పలికి అక్కడికి విచ్చేసిన నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు అందరినీ పేరుపేరునా పరిచయం చేయగా అందరినీ ఆప్యాయంగా పలకరించారు. ఎమ్మెల్యే జోగారావు ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో కాసేపు ముచ్చటించి అందరూ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని ఫలితాలు వాటికి అవే తప్పక వస్తాయన్నారు. ఎమ్మెల్యే జోగారావు నాయకత్వంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో పార్వతీపురం రూరల్, అర్బన్, సీతానగరం మండలాల ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్టాంప్ వెండర్లపై విజిలెన్స్ తనిఖీ



లైసెన్స్ స్టాంప్ వెండర్ల నుంచి వివరాలు సేకరిస్తున్న విజిలెన్స్ అధికారులు



స్టాంపుల విక్రయ కేంద్రం వద్ద వివరాలు తెలియజేస్తున్న విజిలెన్స్, రెవెన్యూ సిబ్బంది

విజయనగరం క్రైమ్: రాష్ట్రవ్యాప్తంగా స్టాంప్ పేపర్ అమ్మకం దారులపై విజిలెన్స్ శాఖ నిర్వహించిన తనిఖీల్లో భాగంగా శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అమలు అధికారి ఎ.సురేష్‌బాబు ఆదేశాలతో గురువారం జిల్లా కేంద్రంలో పలువురు లైసెన్స్‌డ్ స్టాంప్ వెండర్లను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా కొంతమంది వెండర్లు నిర్దేశిత ముఖ విలువ కన్నా, అధిక ధరకు స్టాంప్ పేపర్లను అమ్ముతున్నట్లు గుర్తించి సంబంధిత అమ్మకందారులపై చర్యలకు సిఫార్సు చేశారు. దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సింహాచలం, హెచ్‌సీ అప్పన్న, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పాలకొండలో..

పాలకొండ రూరల్: విజిలెన్స్ ఎస్పీ సురేష్‌బాబు ఆదేశాలతో సిబ్బంది గురువారం పాలకొండలో తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా రిజిస్ట్రేషన్లతో పాటు క్రయవిక్రయాలకు సంబంధించి అవసరమైన స్టాంప్ పేపర్ల విక్రయ కేంద్రాలు లక్ష్యంగా తనిఖీలు చేపట్టినట్లు విజిలెన్స్ ఎస్సై రామారావు తెలిపారు. నగరపంచాయతీ పరిధి పోస్టాఫీస్ రహదారిలో బి.షణ్ముఖరావు దుకాణంలో స్టాంప్ పేపర్ల విక్రయాలకు సంబంధించి నిర్ణీత ధర కంటే అదనంగా రూ.10 నుంచి రూ.20 వరకు వసూలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విజిలెన్స్ ఎస్సైతో పాటు సిబ్బంది ఉమామహేశ్వరరావు, లక్ష్మీనారాయణ, స్థానిక రెవెన్యూ సిబ్బంది బలివాడ సాయి, పి.రమేష్ తదితరులు దాడుల్లో పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై నుంచి జారిపడి యువకుడి మృతి



మృతిచెందిన ఉయ్యక జీవన్(ఫైల్)

కొమరాడ: మండలంలోని చినఖేర్జల పంచాయతీ బట్టి మాగువలస గ్రామం సమీపంలో గురువారం నూర్పు యంత్రంతో ట్రాక్టర్‌పై వెళ్తున్న ఉయ్యక జీవన్ (22) ప్రమదవశాత్తు ట్రాక్టర్ నుంచి జారి పడి త్రీవగాయాల పాలయ్యాడు. దీంతో జీవన్‌ను కొమరాడ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు కొమరాడ ఎస్సై జగదీష్ నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వంతెనపై రక్షణ గోడను ఢీకొని మరో వ్యక్తి..



మొయ్యి శ్రీనివాసరావు (ఫైల్)

భోగాపురం: భోగాపురం జాతీయ రహదారి వంతెనపై రక్షణ గోడను ఢీకొని శ్రీకాకుళం జిల్లా జి సిగడం మండలం బోతులపేట గ్రామానికి చెందిన మొయ్యి శ్రీనివాసరావు(40) గురువారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గుంటూరులో బ్రహ్మరి కోల్డ్ స్టోరేజ్‌లో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబంతో జీవనం సాగిస్తున్న శ్రీనివాస రావు సంక్రాంతి పండగ కోసం భార్య ముగ్గురు పిల్లలను బుధవారం రైలులో పంపించి, తాను దిచక్రవాహనంపై సొంత గ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో భోగాపురం జాతీయ రహదారి వంతెనపైకి చేరుకునే సమయంలో బైక్ అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొట్టడంతో శ్రీనివాసరావు తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఎస్సై కృష్ణమూర్తి సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని 108 వాహనంలో సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి మేనల్లుడు చిత్తిరి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పప్పు ఉడికింది

- సంక్రాంతికి రేషన్ షాపుల్లో నాణ్యమైన కందిపప్పు
- జిల్లాలో కార్డుకు కిలో వంతున 5.74 మెట్రిక్ టన్నుల సరఫరా
- ఇప్పటికే 70 శాతం పంపిణీ



పౌరసరఫరాల శాఖ పంపిణీ చేస్తున్న ఎర్ర కందిపప్పు ప్యాకెట్



నవాబుపేట రేషన్ డిపో పరిధిలో కంది పప్పును ఉడికిస్తున్న పౌరసరఫరాల శాఖ సిబ్బంది

విజయనగరం అర్బన్: పేదింట సంక్రాంతి పండగకు రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న కందిపప్పు పంపిణీ జిల్లాలో కొనసాగుతోంది. జిల్లాకు వచ్చిన కంది పప్పు ప్యాకెట్ల నాణ్యత క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదాకులకు పంపిణీ చేస్తున్నారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన కందిపప్పులో నాణ్యత లేకపోవడం వల్ల లబ్ధిదారులు తీసుకోవడానికి ఇష్టపడడం లేదని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే నాణ్యతను పరీక్షించే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. నమూనా ప్యాకెట్‌లో కందిపప్పును తీసి ఉడకబెట్టి నాణ్యతను పరిశీలించి సంబంధిత మండల పరిధిలో పంపిణీ చేస్తున్నారు. అందులో భాగంగానే పట్టణంలోని దాసన్నపేట పరిధి నవాబుపేట రేషన్ డిపోలో లబ్ధిదారులకు కంది పప్పు పంపిణీ చేసే ముందు నమూనా కందిప్పును లబ్ధిదారుల ఎదుటే మండల శాఖ సిబ్బంది గురువారం నాణ్యత పరీక్షించి చూపించారు.

5.74 లక్షల రేషన్ కార్డుదారులకు పంపిణీ

జిల్లాలోని 27 మండలాల పరిధిలోని 5 లక్షల 74 వేల 561 తెల్ల రేషన్ కార్డుదారులు ఉన్నారు. వారికి ప్రతి నెలా కిలో కందిపప్పు ప్యాకెట్‌ను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ పంపిణీ చేస్తోంది. ఒక్కో కార్డుదారుకు కిలో ప్యాకెట్ వంతున 5.74 మెట్రిక్ టన్నులను అందజేస్తున్నారు. జిల్లాలో ఇంతవరకు 70 శాతం వరకు పంపిణీ జరిగిందని పౌరసరఫరాల డీఎం కె.మీనాకుమారి తెలిపారు.

మెత్తగా ఉడికింది



రేషన్ కార్డుకు వచ్చిన ఎర్ర కందిపప్పు నాణ్యంగా ఉంది. ఉడకబెడితే మంచి వాసన వస్తోంది. మెత్తగా ఉడికిపోతోంది. రుచిగా కూడా ఉంది. నాణ్యమైన కందిపప్పును పంపిణీ చేస్తున్నందుకు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

నైదాన కొండమ్మ, రేషన్ కార్డు లబ్ధిదారు, నవాబుపేట రేషన్ డిపో

లెండిలో సంక్రాంతి సంబరాలు



లెండి ఇంజినీరింగ్ కళాశాలలో భోగి మంట వేసి నృత్యం చేస్తున్న కళాశాల ఛైర్మన్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు



హరిదాసు, సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు



నృత్యం చేస్తున్న విద్యార్థిని

డెంకాడ: జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ముందుగానే భోగి, సంక్రాంతి శోభ కనిపించింది. ఈ మేరకు గురువారం కళాశాలలో భోగి మంటలు వేసి అందులో పిడకలు వేసి పాటలకు లయబద్ధంగా నృత్యాలు చేశారు. కళాశాల ఛైర్మన్ పి.మధుసూదనరావు, వైస్ ఛైర్మన్ పి.శ్రీనివాసరావు, సెక్రటరీ కె.శివరామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ,విద్యార్థులు భోగి మంట చుట్టూ తిరుగుతూ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. రకరకాల డ్రెస్‌లు వేసుకుని కళాశాల వచ్చే విద్యార్థులు గురువారం తెలుగుదనం ఉట్టిపడేలా వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. సంక్రాంతి పండగలో కనిపించే హరిదాసు వంటి పలు రకాల పాత్రలలో విద్యార్థులు కనిించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ ఈ సందడిలో కనిపించింది. విద్యార్థినులు సంక్రాంతి వంటకాలు చేశారు. వివిధ రకాల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి సందడి చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ తమ్మినేని హరిబాబు, పరాంకుశం, విభాగాధిపతులు ఎం. రాజన్‌బాబు, రామారావు, రాజేంద్ర, సుబ్బరామయ్య, సతీష్ పూజారి, దుర్గాశైలజ, డీన్ ప్రకాష్‌బాబు,ఫెమినావింగ్ కో ఆర్డినేటర్ జానకి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలమాంబ హుండీల ఆదాయం లెక్కింపు



చదురుగుడిలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న దేవాదాయశాఖ సిబ్బంది

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి చదురు గుడిలో గురువారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. గతేడాది జూలై నుంచి ఈఏడాది జనవరి 12వతేదీ వరకు హుండీలలో భక్తులు సమర్పించుకున్న కానుకలను లెక్కించగా, ఏడు నెలలకుగాను రూ.1,95,952 ఆదాయం వచ్చినట్లు ఈవో రాధాకృష్ణ తెలిపారు. ఈవోలు వి.రాధాకృష్ణ,ఎం.ప్రసాదరావు, ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ పూడిదాలినాయుడుల ఆధ్వర్యంలో జరిగిన లెక్కింపులో ఆలయ కమిటీసభ్యులు, గ్రామపెద్దలు, దేవాదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹ 230

సాక్షి క్లాసిఫైడ్స్

FLAT FOR SALE

Deluxe 2 BR 1100 Sft & 1250 Sft with Poly Ceiling and Car Parking, Loan can be arranged, 100% vasthu at R & B Guest House Road, Alakananda Colony, VZM, Cont : 98494 73817 [V. 775020]

PLOT FOR SALE

VMRDA అప్రూవ్ - విజయనగరం YSR నగర్ to కొండ వెలగాడ రోడ్, మెడికల్ కాలేజీ దగ్గర 300 Sqyd Plot అమ్మకమునకు కలదు. Sqyd Cost: 6500/- Cont: 8639814432 [S-1156914]

WANTED SITE

200 to 600 Sq Yds Site for Development at Yendada, Madhurawada, Kommadi, Gajuwaka & Vizianagaram. Cont : 92466 24248 [V. 775021]

ఆయుర్వేదం

బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడను. సంప్ర: 9603055647, 7995392747 [G-888]

WANTED

ఆకాశా ఎయిర్‌లైన్స్‌కు కంప్యూటర్ ఆపరేటర్స్, సూపర్‌వైజర్స్, టీం లీడర్స్, టిక్కెట్ కౌంటర్ సూపర్‌వైజర్స్, కస్టమర్‌కేర్ సూపర్‌వైజర్స్ కావలెను. జీ: 22 టు 28,000 రూం + భోజనం ఉచితం, వ: 18-40 సం. అర్హత+ 10th to డిగ్రీ, ITI & Dipoma & B.Tech. ✆ 88850 17934 [B-762867]

ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776025]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.